# గణేశ్ మండపాల్లో జోరుగా లడ్డూల వేలం

- పోటాపోటీగా వేలం పాడి లడ్డూలు దక్కించుకున్న భక్తులు
- గణనాథులకు ప్రముఖుల పూజలు
- పలుచోట్ల అన్నదానాలు
- మరికొన్ని చోట్ల నిమజ్జనాలు
- నృత్యాలతో అలరించిన యువత

మైలార్‌దేవ్‌పల్లి :హైదర్‌గూడ నేతాజీ యూత్ అసోసియేషన్ గణనాథుడి లడ్డూను రూ.1.43 లక్షలకు దక్కించుకున్న నల్లింగ్ జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న నిర్వహకులు

బండ్లగూడ : కోకపేట్ విలేజ్ ఓషియన్ పార్క్ సిద్ధివినాయక అసోసియేషన్ మండపంలో లడ్డూను వేలంలో రూ. 2.36 లక్షలకు దక్కించుకున్న ముంగి జంగారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12, శ్రీరామ్‌నగర్ కాలనీలో శ్రీసాయి గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజల్లో పాల్గొన్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి : డివిజన్‌లోని లక్ష్మీగూడ ఆంజనేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో లడ్డూను రూ.3.05 లక్షలకు దక్కించుకున్న లక్ష్మీగూడ రజక సంఘం సభ్యులు

హిమాయత్‌నగర్ : బోయబస్తీలో గణేషుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు బాబుయాదవ్, శ్రీగణేశ్ యూత్ అసోసియేషన్ నాయకులు

బండ్లగూడ : యాదాద్రి కాలనీలో వినాయకుడి లడ్డూను వేలంలో రూ. 96వేలకు దక్కించుకున్న రమేశ్

బండ్లగూడ : శ్రీకృష్ణ కాలనీలో గణేశ్ లడ్డూను వేలంలో రూ. 55 వేలకు దక్కించుకున్న బుడిగెల బాబురావు

బండ్లగూడ : మాధవినగర్ వినాయక మండపం వద్ద 2.35 లక్షలకు దక్కించుకున్న స్వామి అయ్యప్ప కుటుంబసభ్యులు

రాజేంద్రనగర్ హైదర్షాకోట్‌లోని లిఖిత ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడికి 36 రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించి విశేష పూజలు నిర్వహించిన భక్తులు

బండ్లగూడ : మిడ్‌నీటీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద లడ్డూను వేలంలో రూ. 55వేలకు దక్కించుకున్న బర్కా శివకుమార్‌తో కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు సుధాకర్, సభ్యులు

హిమాయత్‌నగర్ : నారాయణగూడలోని జాహ్నవి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన గణపయ్యకు సోమవారం ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో జాహ్నవి విద్యా సంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్,వైస్ చైర్మన్ ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

బండ్లగూడ: హైదర్‌షాకోట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూను లక్షా 60వేలకు దక్కించుకున్న చింతల సిద్ధు, లెవన్ టైగర్స్ యూత్ అసోసియోషన్ ప్రతినిధులు

శంషాబాద్ రూరల్ : నర్కూడ గ్రామంలో వినాయకుడి పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తిక్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సతీశ్ తదితరులు

## అడ్వకేట్ కార్యాలయం ప్రారంభం

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జేపీఎల్ స్నేహిత సదన్ అపార్ట్‌మెంట్స్‌లో ఏర్పాటు చేసిన అడ్వకేట్ కార్యాలయాన్ని సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్వకేట్లు నారాయణగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రజ్ఞా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

– బండ్లగూడ, సెప్టెంబర్ 16

## మహా విజ్ఞాన సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16 : మహా జ్ఞాన సమాజం ఆధ్వర్యంలో అక్టోబర్ 6న మహా విజ్ఞాన సమ్మేళనం నిర్వహించనున్నారు. సమ్మేళన పోస్టర్లను సోమవారం సాయంత్రం హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుడి విగ్రహం, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద మహా జ్ఞాన సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, సైకాలజిస్ట్ విశ్వనాథ్, ఉపాధ్యక్షుడు తూర్పాటి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. ప్రతినిధులు కృష్ణ, లక్ష్మణ్, అశోక్, నగేశ్, నవీన్, హర్ష, సందీప్, దీక్షిత్, ప్రజ్ఞ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 16: కూకట్‌పల్లిలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన వేడుకలలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ కలిసిమెలిసి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

## భక్తులతో కిటకిటలాడుతున్న మండపాలు

గణనాథుడి పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 16: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక మండపాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, దేవాలయాల వద్ద ప్రతిష్ఠించిన వినాయకులను పెద్ద ఎత్తున దర్శించుకుంటున్నారు.ఈసందర్భంగా నిర్వాహకులు భక్తిగీతాలు, సాం స్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

## సోదరభావం పెంపొందేలా పండుగలు జరుపుకోవాలి

కల్యాణ్‌నగర్‌లో గణేశ్ మండపంలో అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

వెంగళరావునగర్, సెప్టెంబర్ 16: సోదరభావం పెంపొందేలా పండుగలు జరుపుకోవాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం కల్యాణ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని మతాల ప్రజలు పండుగలను సోదరభావంతో శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. గణేశ్ మండపాల వద్ద అన్నదానం చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## అనారోగ్యంతో బీఆర్ఎస్ గిరిజన నాయకుడు మృతి

మృతిచెందిన బీఆర్ఎస్ గిరిజన నాయకుడు చందర్‌నాయక్(ఫైల్)

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 : శంషాబాద్ మండలానికి చెందిన బీఆర్ఎస్ గిరిజన నాయకుడు నేనావత్ చందర్‌నాయక్(72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని మదన్‌పల్లి పాతతండాకు చెందిన నేనావత్ చందర్‌నాయక్ గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేసి బీఆర్ఎస్‌లో చేరారు. దాదాపు ఐదేళ్ల పాటు పార్టీలో కొనసాగారు. గతంలో ఆయన వార్డు సభ్యుడిగా, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పని చేశారు. మదన్‌పల్లి సర్పంచ్‌గా ఆయన భార్య లాలీని గెలిపించుకొని గ్రామానికి సేవలందించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

## జీవశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న ఫణిశ్రీ, రత్నాకర్, మల్లికార్జున్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16 : జీవశ్రీ ఆయుర్వేదిక్ వెల్నేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్‌లో అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఫణిశ్రీ కొంటే, రత్నాకర్ కొంటే, మేనేజర్ మల్లికార్జున్ యాదవ్ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా లాభాపేక్ష లేకుండా రోగులకు వైద్య సేవలందిస్తున్నామని, ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## అకారణంగా దాడికి పాల్పడిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 : బంధువుల ఇంటికి వచ్చిన వారిపై... ఆకారణంగా దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదైంది. సోమవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచారం గ్రామానికి చెందిన శైలజ ఆమె భర్త సురేశ్‌లు మండలంలోని ఊటుపల్లి గ్రామానికి చెందిన వారి బాబాయి రవీందర్ ఇంటికి 15వ తేదీ సాయంత్రం వచ్చారు. ఆదే సమయంలో ఊటుపల్లికి చెందిన కుమ్మరి ఆరవింద్, కుమ్మరి ప్రదీప్‌లు రవీందర్ ఇంటికి వచ్చి సురేశ్‌ను బూతులు తిట్టారు. ఎందుకు తన భర్తను తిడుతున్నారని శైలజ ప్రశ్నించగా ఆమెను సైతం దుర్భాషలాడుతూ సురేశ్ తలపై ఇనుప పైపుతో కొట్టారు. సురేశ్ తలకు గాయమైంది. అంతటితో ఆగకుండా తమ మూడు నెలల పాపను చంపుతామని బెదిరించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ నూతన కమిటీ ఎన్నిక

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 16: తెలంగాణ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా డీఆర్.బంగారిస్వామి ఎన్నికయ్యారు. సోమవారం కూకట్‌పల్లిలో తెలంగాణ రాష్ట్ర బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి, పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా డీఆర్ స్వామి, ప్రధాన కార్యదర్శిగా వి. వెంకటరమణ, కోశాధికారిగా ఎం.చిన్నయ్య, ఉపాధ్యక్షులుగా దుర్గయ్య, రవీంద్రవర్మ, శ్రీకాంత్‌రెడ్డి, మనిమాధవి, సురేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కమల్‌కుమార్, రవీంద్రకుమార్, బి.శ్యామ్, స్వామిగౌడ్, తిరుపతి, కవితలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా ఎం.శ్రీనివాస్‌రావు, అలెగ్జాండర్ ఫ్రాన్సీ, సతీశ్‌గౌడ్, పి.వెంకటరమణ, రిటర్నింగ్ అధికారిగా రోహిత్‌లు వ్యవహరించారు.

## నేడు వినాయక నిమజ్జనం

- ఏర్పాట్లను పరిశీలించిన సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి
- 7వేల మందితో భద్రత ఏర్పాట్లు

పత్తికుంట వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, పోలీస్ అధికారులు

బండ్లగూడ,సెప్టెంబర్ 16 : నవరాత్రులు పూజలు అందుకున్న వినాయకుడిని మంగళవారం నిమజ్జనం చేయనున్నారు. వినాయక నిమజ్జనానికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పల్లె చెరువు, పత్తికుంట,మీరాలం చెరువుల వద్ద అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. పత్తికుంట వద్ద 3, పల్లె చెరువు, మీరాలం చెరువు వద్ద రెండు క్రేన్లను సిద్ధంగా ఉంచారు.

### ఏర్పాట్ల పరిశీలిన..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి పరిశీలించారు. పతికుంట, పల్లె చెరువులను సందర్శించి ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 30 చెరువులను నిమజ్జనానికి అనువుగా తీర్చిదిద్దామన్నారు. 14వేల మండపాలు పోలీసుల అనుమతులను పొందినట్లు తెలిపారు. నిమజ్జనానికి 7వేల మంది సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్టో రెడ్డి, జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

## గణేశ్ శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి

- సీసీ కెమెరాలతో నిఘా..
- బషీర్‌బాగ్, నారాయణగూడ ఫ్లైఓవర్ల మూసివేత

నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యూ.చంద్రశేఖర్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 16: నగరంలో నవరాత్రులు పూజలందుకున్న వినాయకులను నిమజ్జనం చేసేందుకు భక్తులు సిద్ధమయ్యారు. మంగళవారం జరిగే గణనాథుల శోభాయాత్రను వీక్షించేందుకు వేలాది మంది తరలివచ్చే అవకాశం ఉన్నందున నారాయణగూడ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. గణేశ్ శోభయాత్ర వెళ్లే ఈ మార్గం కీలక ప్రాంతం కావడంతో పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఉంచారు. ట్యాంక్‌బండ్‌కు సమీపంలోని లిబర్టీ, బషీర్‌బాగ్, హైదర్‌గూడ, హిమాయత్‌నగర్, నారాయణగూడ తదితర ప్రాంతాల ప్రధాన రోడ్లపై భద్రతను కట్టుదిట్టం చేశారు.

పీఎస్ పరిధిలోని సిబ్బందితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన అదనపు సిబ్బందితో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. 10 ప్రాంతాల్లో పికెట్లు, 12 పుషింగ్ పార్టీలు, సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన రోడ్లు, కూడళ్ల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పోలీసు అధికారులు పర్యవేక్షిస్తారు.

బషీర్‌బాగ్, నారాయణగూడ ఫ్లైఓవర్ బ్రిడ్జిలతోపాటు ప్రధాన రహదారులకు ఇరువైపులా కాలనీలు, బస్తీల దారులని ముళ్ల కంచెలు, బారికేడ్లతో మూసివేయనున్నట్లు నారాయణ గూడ ఇన్‌స్పెక్టర్ యూ. చంద్రశేఖర్ తెలిపారు. వాహనాలకు హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకే అనుమతి ఉంటుందని, వినాయక వాహనాలను మాత్రమే ట్యాంక్ బండ్‌పైకి అనుమతించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించాలని సూచించారు.

## ఏపీలో ప్రజలు సంతోషంగా లేరు..

- టీడీపీ నేతలు ఎన్నికల వాగ్దానాలను మరిచారు..
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ప్రజలెవరూ సంతోషంగా లేరని వైసీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలు మొదటి మూడు నెలల పాలననే గమనిస్తారని, ఈ తక్కువ కాలంలోనే టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రతి నియోజకవర్గంలో గొడవలు, కొట్లాటలు పెరిగాయన్నారు. గత వైసీపీ పాలనలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయని పేర్కొన్నారు.

టీడీపీ నాయకులు గత ఐదు సంవత్సరాల్లో ఏపీ అస్తవ్యస్తమైందని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. పొలవరంపైనా అబద్ధం చెబుతున్నారని, ఆ ప్రాజెక్టు ఇప్పుడే నిర్మాణం మొదలైనట్టు చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అప్పులు పెరిగాయని, ఏపీ మరో శ్రీలంక అవుతుందని దుమారం లేపారని, ఈ మూడు నెలల కాలంలో చేసిన అప్పుల విషయాన్ని టీడీపీ ప్రభుత్వం బయటపెట్టాలన్నారు. పోలవరం పనులు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైనట్లు గుర్తు చేశారు. 2014 నుంచి 2019 మధ్యలో టీడీపీ హయాంలో పోలవరాన్ని ఎందుకు పూర్తి చేయలేదని ఆయన ప్రశ్నించారు.

## సన్మానం

మైలార్‌దేవ్‌పల్లి : ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో లడ్డూను రూ.70 వేలకు దక్కించుకున్న ఉప్పల దేవరాజ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

## నిమజ్జన ఊరేగింపు

మైలార్‌దేవ్‌పల్లి : గణేశ్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న యువకులు

## చిరస్మరణీయుడు.. భీమయ్య సగర

సగర జాతి అభివృద్ధికి కృషి చేసిన గిన్నె భీమయ్య సగర చిరస్మరణీయుడని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. ఇటీవల మృతిచెందిన భీమయ్య సంస్మరణ సభ సోమవారం గచ్చిబౌలిలోని రాష్ట్ర సగర సంఘం కార్యాలయంలో నిర్వహించారు. భీమయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సగర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. – కొండాపూర్